క్లుప్తంగా

విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలి


ఆసుపత్రి ఆవరణలో ధర్నాకు కూర్చున్న వడ్డె పద్మావతి

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో తనకు తిరిగి సెక్యూరిటీ గార్డు ఉద్యోగం ఇప్పించి న్యాయం చేయాలని వడ్డె పద్మావతి అనే మహిళ మంగళవారం ఆసుపత్రి ఆవరణలో ధర్నా చేసింది. న్యాయం చేయాలంటూ ఫ్లకార్డు పట్టుకుని ధర్నాలో కూర్చున్న ఆమె మాట్లాడుతూ.. తాను 2017 నుంచి ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేశానన్నారు. ఇద్దరు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు లైంగికంగా, మానసికంగా వేధించారని ఆరోపించారు. ఒంటరి మహిళ అయిన తాను వారి మాట వినకపోతే, లొంగకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరించారన్నారు. వేధింపులపై విరక్తి చెంది పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారిపై చర్యలు తీసుకోకపోవడంతో పాటు తనను ఉద్యోగం నుంచి తొలగించారని వాపోయారు. వారిని విధుల్లో కొనసాగిస్తున్నారని, తనను మాత్రం ఉద్యోగంలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనను విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

15 నుంచి బాలోత్సవ్

కర్నూలు (సిటీ): ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు మూడు రోజుల పాటు బాలోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని డీఈఓ శామ్యూల్ పాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు బాలోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 60కి పైగా వివిధ అంశాలపై పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థులందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి


మాట్లాడుతున్న డీపీఎం అనుపమ

సి.బెళగల్: అనుకోకుండా సంభవించే విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని డీపీఎం అనుపమ ప్రజలకు సూచించారు. మండలంలోని కొత్తకోట గ్రామంలో మంగళవారం జాతీయ విపత్తుల నివారణ సంస్థ (ఎన్డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో ప్రజలు వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు తుంగభద్ర నది తీర కరకట్టపై గ్రామస్తులు, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీపీఎం మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు, ప్రకృతి ప్రకోపాలతో ఏర్పడే తుపాన్, వరదల సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలతో ధైర్యంగా ఎదుర్కొని ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కాపాడుకోవాలన్నారు. అనంతరం ఎన్డీఆర్ఎఫ్ సీఐ గౌరవ్‌యాదవ్ ఆధ్వర్యంలో సిబ్బంది స్థానికులు, సచివాలయ ఉద్యోగులకు వరదల సమయంలో వ్యవహరించాల్సిన తీరుపై నదిలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ పురుషోత్తం, కోడుమూరు ఫైర్ స్టేషన్ ఎస్ఐ దౌలత్, ఎంపీటీసీ సభ్యుడు మణిమోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సైఫుల్లబేగ్, వీఆర్వో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం


గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్

కల్లూరు: రీసర్వే, ఇతర భూముల సమస్యలపై రైతులు అందజేసిన వినతులను సకాలంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం పుసులూరు గ్రామంలో తహసీల్దార్ గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసు లు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.


కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటా రూ..లలో)

వేరుశనగ	3394	6710
పొద్దుతిరుగుడు	1509	5369
ఆముదం	5329	6018
వాము	12269	20960
ఉల్లి	644	4669
ఎండుమిర్చి	1039	12345
శనగలు	6009	6009
కందులు	3841	7100
మొక్కజొన్న	1869	2271
మినుములు	1300	7739
కొర్రలు	2479	3491
సోయాచిక్కుడు	4079	4191
సజ్జలు	1969	2159

సీఎంగా చంద్రబాబు విఫలం

- ఐదు నెలల్లో రూ.20 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపడం అన్యాయం
- ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయలేదు
- ప్రభుత్వ వైఫల్యాలను వివరించేందుకు 8 నుంచి 14వ తేదీ వరకు సీపీఎం ప్రజాపోరు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ఐదు నెలల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు నవంబర్ 8 నుంచి 14వ తేదీ వరకు ప్రజాపోరు పేరు పేరిట పోరాటాలకు దిగుతున్నట్లు చెప్పారు. 14వ తేదీన కలెక్టరేట్, అన్ని మండల కేంద్రంల్లో పెద్ద ఎత్తున ధర్నాలు, రస్తారోకోలు చేపట్టనున్నట్లు వివరించారు. మంగళవారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ కూటమి పాలనలో రౌడీయిజం పెచ్చుమీరిపోతోందని విమర్శించారు. మద్యం పాలసీ పేరిట బెల్టుషాపులను ఊరూరా పెంచి పోస్తున్నారని ఆరోపించారు. ఉచిత ఇసుకను ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చి రౌడీయిజం చేయిస్తున్నారని మండిపడ్డారు. ఇసుకను కొనుగోలు చేసేందుకు కూడా లేకుండా చేశారని, పైగా ఇసుక రవాణా ధరలు తక్కువగా ఉన్నాయని చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు నెలలు కాకమునుపే ప్రజలపై విద్యుత్ ట్రూఅప్ చార్జీల భారం మోపారని, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏకంగా రూ.20 వేల కోట్ల భారం మోపడం అన్యాయమన్నారు. కర్నూలు–ఆదోని, కర్నూలు–మంత్రాలయం, పత్తికొండ–ఆదోని ఇలా ఏ రహదారి చూసినా గుంతలమయంగా మారిందని, ఒక్క రహదారిని కూడా బాగుచేయలేదన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటి కూడా పరిపూర్ణంగా అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. సీపీఎం నగర కార్యదర్శులు రాజశేఖర్, రాముడు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 43వ వార్డు మహాసభలు ఇందిరాగాంధీ నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇచ్చి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సీఎం అయ్యారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళలకు నెలకు రూ.1500, పిల్లలను బడికి పంపే తల్లులకు రూ.15 వేలు, రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం, ఇతర హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఐదు నెలల పాలనలోనే ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపారని, ఏకంగా రూ.17 వేల కోట్లను ట్రూ అప్‌చార్జీల పేరిట వసూలు చేయడం అన్యాయమని మండిపడ్డారు. కార్యక్రమంలో టి.రాముడు, వి.శంకర్ హాజరయ్యారు.

విరిగిన స్తంభాలు.. వెలగని దీపాలు

- సమస్యలకు కేరాఫ్ కొండారెడ్డి బురుజు పార్కు
- అసౌకర్యాలతో ప్రజల ఇబ్బందులు


పాతబస్టాండ్ మున్సిపల్ పార్కులో విరిగిన లైటింగ్ స్తంభం


పార్కులో వెలగని లైటింగ్ పోల్

కర్నూలు (టౌన్): స్థానిక పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న పార్కులో పది నెలల క్రితం అప్పటి ఎమ్మెల్యే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రూ.2 కోట్లు వెచ్చించి పార్కును అందంగా తీర్చిదిద్దారు. రోడ్లను వెడల్పు చేసి, డివైడర్లను ఏర్పాటు చేశారు. కొండారెడ్డి బురుజును లేజర్ లైటింగ్‌తో అబ్బురపరిచే విధంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వం మారి 5 నెలలు దాటింది. నిర్వహణలోపంతో పాతబస్టాండ్‌లో పాతబస్తీ వాసులు సేదతీరేందుకు ఏర్పాటు చేసిన పార్కు సమస్యలకు కేరాఫ్‌గా మారింది. గ్రీనరీ దెబ్బతింది. పలుచోట్ల పచ్చగడి కనిపించడం లేదు. లైట్లు వెలగడం లేదు. సాయంత్రం 6 గంటలకే చీకటిగా మారుతోంది. స్తంభాలు విరిగిపోయాయి. పర్యవేక్షణ లేకపోవడంతో ఈ సమస్య వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం వేళ పార్కులో పిల్లలు, కుటుంబ సభ్యులతో సేదతీరేందుకు వచ్చేవారు విమర్శలు చేస్తున్నారు. ఎంతో చక్కగా ఉన్న మున్సిపల్ పార్కును ప్రస్తుత పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఐదు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తామన్న సంగతి దేవుడెరుగు.. కనీసం ఉన్న వాటినైనా సంరక్షించే విధంగా చర్యలు తీసుకుంటే చాలన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

దాతల సేవలు అభినందనీయం


సకల దీక్షదారులకు అన్నదానం చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: సకల దీక్షదారులకు అన్నదానం చేస్తున్న దాతల సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ పరిధిలోని 32వ వార్డులోని అశ్వర్థ నారాయణ సాయిబాబా మందిరంలో సకల దీక్షదారులకు అన్నదానం కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మల్లారెడ్డి, కార్పొరేటర్ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

పెద్దకడబూరు: మండల పరిధిలోని రంగాపురం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. రంగాపురం గ్రామం సమీపంలోని కొండలో 11మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడి చేయగా వారిలో ఇద్దరు మాత్రమే దొరికారన్నారు. మిగిలిన 9మంది పారిపోయారని, మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసి వారి నుంచి రూ. 20,200లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

ముగ్గురిపై కేసు నమోదు

మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామానికి చెందిన బోయ వెంకన్నతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామంలోని గ్యాస్ గోడౌన్ వద్ద ఉన్న కుక్కను తోలమని అటుగా వెళ్తున్న చాకలి నరసింహులును ఆ ముగ్గురు సూచించారు. ఆయన నేను తోలను నన్ను కరుస్తుందని చెప్పడంతో మాకే ఎదురు చెప్పుతావా అంటూ దాడి చేశారు. చాకలి నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యంతో ఎస్ఐ విజయకుమార్

మంత్రాలయం : మండల పరిధిలోని మాధవరం సంత మార్కెట్ సమీపంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం గిలకసూగూరు క్యాంప్ గ్రామానికి చెందిన నాగేష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై 288 ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు తీసుకెళ్తూ పట్టుబడ్డారన్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

నాటుసారా విక్రేత అరెస్టు

ఆదోని రూరల్: మండలంలోని బసాపురం గ్రామానికి చెందిన పెద్ద పార్వతి అనే మహిళ తన ఇంటి వద్ద నాటుసారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఇస్పీ ఎస్ఐ నాగేంద్ర మంగళవారం తెలిపారు. సదరు మహిళ వద్ద నుంచి పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

ఆశా కార్యకర్తలను ఆదుకోవాలి


మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రమిస్తున్న ఆశా కార్యకర్తలు

కల్లూరు: గత ప్రభుత్వం ఫిబ్రవరి నెలలో ఆశా వర్కర్ల సమస్యలపై యూనియన్ నాయకులతో జరిపిన చర్చలలో ఆమోదించిన జీఓలను విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు సీహెచ్ సాయిబాబా, సుధాకరప్ప, యేసు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. మంగళవారం ఆశా డే సందర్భంగా కల్లూరు అర్బన్ పరిధిలోని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వీకర్‌సెక్షన్ కాలనీ, ముజఫర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లకు ఆశా కార్యకర్తలతో కలసి సీఐటీయూ నాయకులు వినతి పత్రమిచ్చారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు జ్యోతి రాణి, రజినీ, ఇమాంబీ, ఇందిర, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

బిడ్డలకు పాలిచ్చేందుకు చోటు చూపరూ..!

- నగర పాలక కార్యాలయంలో మహిళలకు సౌకర్యాలు కరువు
- గతంలో బాలింతలు పిల్లలకు పాలుపట్టించేందుకు ప్రత్యేక గది
- ప్రస్తుతం సౌకర్యం లేక చంటిబిడ్డల తల్లుల అవస్థలు



కర్నూలు (టౌన్): నగరపాలక కార్యాలయానికి ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు వస్తుంటారు. ఇక్కడి కార్యాలయంలో సి సెక్షన్ మేనేజర్ కార్యాలయం, ఇంజినీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, ఆరోగ్య శాఖ విభాగం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయం, అకౌంట్స్ విభాగం ఉన్నాయి. ఇంటి, నీటి పన్నులు, ఇంటి అనుమతులు, పేరు మార్పు తదితర వాటి కోసం వచ్చేవారితో కార్యాలయం నిత్యం రద్దీ ఉంటుంది. పన్నులు చెల్లించేందుకు క్యూలో నిలబడి వేచి ఉండాల్సిన పరిస్థితి షరామామూలే. అలాగే కమిషనర్‌కు నేరుగా సమస్యను విన్నవించేందుకు వస్తుంటారు. అక్కడకూడా చాలాసేపు వేచి ఉండాలి. మహిళలు, పురుషులు అన్న తేడా లేకుండా కార్యాలయానికి వస్తుంటారు. ముఖ్యంగా చిన్న పిల్లలతో వచ్చే మహిళలు తగిన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయ ప్రధాన గేటు వద్ద జనన, మరణ ధ్రువపత్రాల విభాగం ఉంది. అనేక మంది తల్లులు ధ్రువపత్రాల కోసం వస్తుంటారు. అయితే పిల్లలకు పాలు ఇచ్చేందుకు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్య ఉన్నా నగరపాలక అధికారులు పట్టించుకోవడం లేదు. సరైన సమయంలో సిబ్బంది లేకపోవడంతో గంటలకొద్దీ మహిళలు నిరీక్షణలో ఉండాల్సి వస్తుంది. గతంలో ఇదే సమస్య వచ్చినప్పుడు అప్పట్లో ఐఏఎస్ హోదాలో కమిషనర్‌గా పనిచేసిన ప్రశాంతి తల్లుల కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. దీనివల్ల మహిళలకు, తల్లులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అయితే ఆమె బదిలీ తర్వాత అది కాస్తా అటకెక్కింది. దీంతో మళ్లీ తల్లులకు సమస్య తప్పడం లేదు. ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బంది పడుతున్న సంఘటనలు అక్కడ కనిపిస్తుంటాయి. జనన, మరణ విభాగానికి ఎదురుగా మూడు గదులు ఉన్నాయి. అందులో ఒకటి పిల్లలకు పాలిచ్చే తల్లుల కోసం కేటాయించాలని, నగరపాలక ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలని మహిళలు కోరుతున్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం


కర్నూలు(హాస్పిటల్): గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి చెప్పారు. మంగళవారం స్థానిక ముజఫర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఆశా డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లింగనిర్ధారణ చట్టాన్ని అతిక్రమించి పరీక్షలు చేసిన వారికి, చేయించిన వారికి, అందుకు సహకరించిన వారికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారని చెప్పారు. వైద్యాధికారి డాక్టర్ డి.సుప్రియ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్ట విరుద్ధమని, ఈ వివాహాలు జీవితాలపై దుష్ప్రభావాలు చూపుతాయన్నారు. బాల్య వివాహాల వల్ల ప్రసూతి మరణాలు, శిశుమరణాలు పెరుగుతాయన్నారు. బాల్య వివాహాలు చేసిన తల్లిదండ్రులు, బంధువులు, పురోహితులు, సహకరించిన వారు కూడా చట్టం ప్రకారం శిక్షార్హులవుతారని తెలిపారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానందీశుడి దంపతులకు కల్యాణం



మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు మంగళవారం కార్తీకమాసం పురస్కరించుకుని కల్యాణం నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మ, నాగేశ్వరశర్మలు స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లను కొలువు తీర్చి వేదమంత్రోచ్చారణలతో వేదోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

భ్రమరాంబా మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు


స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునలకు ప్రత్యేక పూజలు మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి షోడశోపచార పూజలు జరిపారు. అలాగే భ్రమరాంబాదేవికి ఊయలసేవ నిర్వహించారు.

ఎల్ఐసీ కళాజాత పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను విడుదల చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): త్వరలో బెంగళూరులో జరగనున్న సౌత్‌సెంట్రల్ ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం మహాసభలపై ప్రజలకు అవగాహన కోసం కళాజాత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈనెల 13వ తేదీన కళాజాత జీపు కర్నూలుకు చేరుకుంటుందని ఎల్ఐసీ సౌత్‌సెంట్రల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సెక్రటరీ జి.తిరుపతిరావు, కడప డివిజన్ సెక్రటరీ రఘునాథ్‌రెడ్డి, హైదరాబాద్ డివిజన్ సెక్రటరీ మద్దిలేటి చెప్పారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో వారు కళాజాతకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రజాధనం–ప్రజల కోసమే వినియోగించాలన్న ప్రధాన ఉద్దేశంతో సౌత్‌సెంట్రల్ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎల్ఐసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేస్తామని చెప్పారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో వ్యక్తి మృతి

కర్నూలు (టౌన్): నాలుగవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో ముజఫర్ నగర్‌కు చెందిన నాగేశ్వరరావు (40) అప్పుల బాధతో మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకొని బలవన్మరణం చెందాడు. ఆయన స్థానికంగా బట్టల షాపులో గుమస్తాగా పని చేసేవాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ రూ.3 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీరక వడ్డీలు చెల్లించలేక విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

కోలుకోలేక మహిళ మృతి

మూడవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో నివసించే గిడ్డమ్మ అనే మహిళ ఇంట్లో గొడవ పడి ఈ నెల 1వ తేదీన ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె కోలుకోలేక మంగళవారం సాయంత్రం మృతి చెందింది. భర్త సామేల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. గిడ్డమ్మకు కుమారుడు, కూతురు ఉన్నారు.

రిటైర్డ్ లెక్చరర్ మృతి

కర్నూలు (సిటీ): ఉస్మానియా కాలేజీకి చెందిన రిటైర్డ్ కామర్స్ లెక్చరర్ ఎం.గౌస్‌బేగ్ సాహెబ్ సౌదీఅరేబియాలో మంగళవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఈ సందర్భంగా ఆ కాలేజీ సిబ్బంది, విద్యార్థులు సంతాప సభ నిర్వహించారు. ఈయన ఉస్మానియా కాలేజీలో మూడు దశాబ్దాలకు పైగా కామర్స్ లెక్చరర్‌గా పనిచేశారు. ఆ సమయంలో ఆయన అందించిన సేవలను సభలో పలువురు కొనియాడారు.

కేసీలో బాలిక గల్లంతు

కర్నూలు (టౌన్): బట్టలు ఉతుకుతూ కేసీలో జారిపడి ఓ బాలిక గల్లంతయ్యింది. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద నివాసం ఉండే శాంతమ్మ భిక్షాటన చేస్తు జీవిస్తోంది. ఆమె కూతురు షేకూన్ మంగళవారం సాయంత్రం కేవీఆర్ కళాశాల వద్ద ఉన్న కేసీ కెనాల్ ఒడ్డున బట్టలు ఉతుకుతూ ప్రమాదవశాత్తు జారి పడింది. నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. స్థానికులు గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో రెండవ పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.





జర జాగ్రత్త !

జిల్లా పరిపాలనా కార్యాలయం కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద జంతువులు రాకుండా ఏర్పాటు చేసిన యానిమల్ గార్డ్ కడ్డీలు తుప్పు పట్టి విరిగిపోవడంతో ప్రజలు నడవడానికి ఇబ్బందిగా మారింది. నిత్యం వందలాది మంది ప్రజలు వివిధ పనులపై కలెక్టరేట్‌కు వస్తూ పోతూ ఉంటారు. వీరంతా ప్రధాన గేటు వద్ద ఇనుప గ్రిల్‌ను దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, పిల్లలు మరొకరి సాయంతో గేటు దాటాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు